# దీపానికి చమురు

## శీలా వీర్రాజు

కామేశ్వర్రావు దగ్గర్నుంచే వచ్చింది వుత్తరం. మరీ పొడిపొడిగా వుంది. మందాకిని కనిపించింది అని ప్రారంభిస్తే ఆ వుత్తరంనిండా మందాకినినే చూడొచ్చనుకున్నాను. 'అబ్బ! మందాకిని వుండగా యింత చిన్నఉత్తరం ఎలా రాయగలిగాడు!' అనిపించింది. కామేశ్వర్రావుమీద కాస్తకోపమూ, చిరాకూ కలిగాయి. మొదటినుంచీ ఇంతే. ఎప్పుడూ మందాకినిని తీసిపారేయడమే. ఆమె అంటే ఏ ప్రత్యేకతా తనకు లేదని ప్రకటించుకోడానికే ప్రయత్నించేవాడు. తన వ్యక్తిత్వాన్నీ, దాని ఆధిక్యతనీ తెలుపుకోవడానికి చేసే ప్రయత్నమే ఇదంతా.

మరోసారి ఉత్తరం చదువుకున్నాను. ఓ కొత్తమాట కనిపించింది. మందాకినిని అక్షరాల్లో చూద్దామన్న కంగారులో యింతకుముందు దాటేసివుండాలి. 'నిన్ను గురించి అడిగింది' అనివుంది. అడిగిందా... అడగదూ...చిన్నప్పుడు కలిసి ఆడుకునీ, చదువుకునీ, ఏడిపించుకునీ గడిపిన రోజుల్ని అప్పుడే ఎలా మర్చిపోతుంది. దూరంగా వెళ్ళిపోతేమాత్రం బాల్యాన్ని మర్చిపోతుందీ? ఎలా మర్చిపోగలదు? మర్చిపోలేదు... ఆ రోజులు – అయ్యో! అవిక రావు. వాటికి రెక్క లొచ్చేశాయి. ఇంకెక్కడి బాల్యం; ఎప్పుడో ఎగిరిపోయింది.

.............సింహాచలం కొండమీద సంపంగిపూలు ఏరుకుంటూ కనిపించింది. ఓ మిత్రుడి పెళ్ళికని వెళ్ళాను. పెళ్ళయ్యాక అలా కొండమీద తిరుగుదామని వెళ్తోంటే పాతికమంది అమ్మాయిలతో సంపంగిపూలు ఏరుకుంటూ కనిపించింది. తనే పలకరించింది. ఎక్స్కర్షన్ కని స్కూలు పిల్లల్ని తీసుకొచ్చిందట. నిన్నుగురించి అడిగింది. చెప్పడం మర్చిపోయాను. ఆమె యిప్పుడు శ్రీకాకుళంలో అన్ట్రయిన్డ్ టీచరుగా పనిచేస్తోంది. ఒకసారి మనిద్దర్నీ రమ్మంది. ఎప్పుడొస్తావుమరి. వారం పదిరోజుల్లో రా, వెళ్దాం......

కామేశ్వర్రావు వుత్తరంలో ఆమెను గురించి అంతేవుంది.

ఇదేమిటి! ఆమె వుద్యోగం ఎందుకు చేస్తోంది? వాళ్ళాయనకు ఖర్గపూర్ లో వుద్యోగం కదా. ఎప్పుడు ట్రాన్స్ఫర్ అయ్యింది. అయితే దగ్గరగా వచ్చేసిందన్నమాట.

మందాకిని యింత దూరమైపోతుందని అప్పట్లో అనుకోలేదు. రెండేళ్ళుగా బొత్తిగా ఆమె సమాచారమే తెలీలేదు. అప్పట్లో మా ముగ్గురిదీ ఒకటే ఆలోచన. ఈ ఆలోచనకు బహుశా పరోక్షంగా మందాకినే కారకురాలు కావచ్చు. 'ఏమో. ఈ పెళ్ళి......ఈ బాదరబందీ నాకు ఇష్టంలేదు. ఎప్పుడూ యిలానే వుండిపోదామనుకుంటున్నాను' అనేది. ఆ ప్రభావం మా ఇద్దరిమీదా పడిందేమో మరి. అలాంటి అభిప్రాయాలే మాలోనూ కలిగాయి. అనేకసార్లు కామేశ్వర్రావూ, నేనూ అనుకున్నాం – పెళ్ళిచేసుకోకుండా బ్రహ్మచారులుగా వుండిపోదామని. చాలా విషయాలలో మా ముగ్గురి ఆలోచనలూ ఒకటే. అభిరుచులూ, ఆశయాల్లో చాలా దగ్గరిపోలికలు వుండేవి. కొద్దిపాటి తేడా ఎక్కడైనా కనిపిస్తే, వాటినీ సవరించుకోవడానికి అభ్యంతరం వుండేది కాదు.

కామేశ్వర్రావూ, మందాకినీ ఒకే యింట్లో రెండు పోర్షన్లలో వుండేవారు. డాబాయిల్లు. నేను పదిళ్ళవతల వుండేవాడిని. రేడియో వినడానికో, కథల పుస్తకాలు చదువుకోడానికో, కబుర్లు చెప్పుకోడానికో రోజూ సాయంకాలాలు కామేశ్వర్రావు యింటికి వెళ్ళేవాడిని. మందాకినికూడా వచ్చేది. రేడియో వినేవాళ్ళం. కేరమ్సు ఆడుకునేవాళ్ళం. వాళ్ళ దొడ్లో ఉసిరికాయలు కోసుకుని, ఉప్పూ, కారం ముంచుకుని తినేవాళ్ళం. బాదంకాయలు కొట్టుకునేవాళ్ళం. కామేశ్వర్రావు చెట్టెక్కలేడు. మందాకిని సరేసరి. నేనే ఎక్కి కోసేవాడిని.

ఒక కలలాగ చూస్తూవుండగనే బాల్యం కదిలి వెళ్ళిపోయింది. పెద్దాళ్ళ చూపుల్లోని సూదిమొనలు గుచ్చుకోవడం ప్రారంభించిన తొలిసారే అర్థమయ్యింది – బాల్యం రెక్కలొచ్చి ఎగిరిపోయిందని. ఎగిరిపోయిన యీ కోయిల మళ్ళీ యీ జీవితకాలంలో గూటికొచ్చి వాలదని; ఎక్కడో ఓ చెట్టు కనిపిస్తుంది; రంగురంగుల పూలు చూపిస్తుంది; కొమ్మలు గాలికి కదిలి రమ్మంటాయి; అక్కడ వాలుతుంది; కొత్తగూడు కట్టుకుంటుంది; అందులోనే వుండిపోతుంది; ఎప్పుడో అక్కడే కన్నుమూస్తుంది.

కామేశ్వర్రావు డ్రాయింగు నేర్చుకుంటున్నాడు.

మందాకిని సంగీతం నేర్చుకుంటోంది.

నాకు పుస్తకా లున్నాయి.

"ఇదిగో యీ పాయింట్ దగ్గరే మనం విడిపోతున్నాం," అన్నాను ఒకసారి.

"లేదు, మూడూ వొక్కలాంటివే" – అంది. ఆ వయసులో అంతకన్నా ఎక్కువ సమర్థించలేకపోయింది. ఇప్పుడైతే "ఇవి మూడూ మూడు దారులే కాని వీటి

గమ్యంమాత్రం ఒక్కటే. మనోల్లాసమూ, మానసిక వికాసమూ, వీటన్నిటినీ మించి ఒకవిధమైన ఆర్ద్రత, లాలిత్యము, సంస్కారము-ఇవి కలిగించడమే ప్రధానలక్ష్యం. దానికి యివన్నీ దారులు," అంటూ అదే భావాన్ని యింకా విపులంగా చెప్పిండేది.

నిజానికి ఆ రోజుల్లో నే మందాకిని అనేక విషయాలమీద వ్యాఖ్యానాలు చేసేది. తప్పైనా ఒప్పుకుని తీరాల్సిందే. కాదంటే వినేదికాదు. మరీ మొండిదానిలా అనిపించేది మాకు. ఎందుకులే అని వూరుకునే వాడిని. కామేశ్వర్రావు వూరుకునేవాడు కాదు. వాదించేవాడు. చివరకు విసుగొచ్చి, కోపం వొచ్చి వూరుకునేవాడు. నిజానికి, తన ఓటమిని ఒప్పుకోవడానికి స్త్రీ సిగ్గుపడదు. పురుషుడు పూర్తిగా యిందుకు విరుద్ధం. కాని యిక్కడ యిది తారుమారయ్యింది.

ఆ మొండితనంలోంచే మందాకిని ఒకవిధమైన వ్యక్తిత్వాన్ని రూపొందించుకుంది. ఎవరినీ లక్ష్యపెట్టని స్వభావం అలవడిందామెకు. తనను చూసి ఏడ్చేవాళ్లను మరీ ఏడిపించాలనీ, తనను లక్ష్యపెట్టనివాళ్ళను తనూ లక్ష్యపెట్టగూడదనీ, బయటికి విలక్షణంగా కనిపించి హృదయాన్ని మంచితనంతో నింపుకోవాలనీ, యితరుల వూహకు తను అందగూడదనీ-యిలాంటి ఆలోచనలు ఆమెవి.

ఆ ఆలోచనలే ఆమెకు శత్రువులవుతాయేమోనని నా భయం.

అలా అని ఆమెతో అంటే చిరునవ్వు నవ్వేసింది. ఆ నవ్వు వెనక నిర్లక్ష్యం లేదు. అభిమానాన్ని గుర్తించినప్పటి కృతజ్ఞత వుంది. స్త్రీ చిరునవ్వు వెనక సంతృప్తి వుంటుంది, ఆనందం వుంటుంది. పురుషుడి చిరునవ్వు వెనక గర్వం వుంటుంది; ఆడంబరంకూడా వుంటుంది. నిర్లక్ష్యపు చిరునవ్వుతోపాటు చూపులుకూడా నిర్లక్ష్యంగా మనిషిని దాటుకుని దూరంగా జారిపోతాయి. అభిమానపు చిరునవ్వుతో పాటు



చూపులు ఆ మనిషిమీదే వాలతాయి. అందుకే ఆమె నిర్లక్ష్యంతో నన్ను తీసి పారేయలేదన్న సంతృప్తి నాకు.

అలాంటి సంతృప్తి ఎప్పుడోగాని మిగి ల్చేదికాదు. కామేశ్వర్రావుకయితే ఆ సంతృప్తి అసలే లేదు.

ఒకసారి కామేశ్వర్రావు అన్నాడు, "నాకు పెళ్ళి చేసుకోవాలనిలేదు. ఇలానే వుండిపోవా లనుకుంటున్నాను. ఏ వూరి చివరనో కాలవపక్కన చిన్న పాకేసుకుని బొమ్మలు గీసుకుంటూ, మనసుపుట్టినప్పుడు వూళ్ళు తిరుగుతూ నిశ్చింతగా జీవితాన్ని గడిపేయాలని వుంది," అన్నాడు.

"అదిగో! నన్ను కాపీకొట్టేస్తున్నావ్. ఆ ఐడియా నాది. దాన్ని నువ్వు స్వంతం చేసేసుకొంటున్నావ్. ఒప్పేసుకో" అంది.

నిజానికి ఆమె ఆ అభిప్రాయాన్ని అనేక మార్లు వ్యక్తపరిచేవుంది.

"డొల్లగా వున్నప్పుడే వేణువులో



రాగం పలుకుతుంది. గుల్లగా వుంటేనే మద్దెల మోగుతుంది. వీణ వాయులీనాలలో రాగం ప్రవాహమై పారుతుంది. అలానే ఏ కోరికలూ లేకుండా హృదయం శూన్యమై వున్నప్పుడే జీవితంలో ప్రశాంత సంగీతం ప్రతిధ్వనిస్తుంది. అందుకే అతి సామాన్యంగా యీ జీవితం గడిచిపోతే చాలు. ఏ బరువూ, బాధ్యతలూ, ఏ కోరికలూ నాకు అక్కరలేదు...ఏమో యీ పెళ్ళీ యీ బాదరబందీ నాకు యిష్టం లేదు. ఎప్పుడూ యిలానే వుండిపోదామనుకుంటున్నాను," అని చాలాసార్లు అంది.

ఆమె అన్నట్టు ఆమెకు కాపీ అయితే కావచ్చు. అంత సన్నిహితంగా వుంటున్నప్పుడు ఒకరి ప్రభావం మరొకరిమీద పడకపోదు. ప్రాణంలేని పరిసరాలే మనిషిని ప్రభావితం చేస్తున్నప్పుడు తోటి మనిషి ఎందుకు చేయలేడూ? ఆ మాటకొస్తే మందాకిని ఏర్పరచుకున్న సగం అభిప్రాయాలకు రూపకల్పన చేసినవాడు కామేశ్వరరావే. ఆ విషయం ఆమె వొప్పుకోదు. నాలాగ మీకూ అన్నివిషయాలూ తెలుసుంటే మీరుకూడా 'అవును సుమా, కామేశ్వరరావే' అంటారు.

మందాకినీని చూసి చాలా కాలమైంది. మరీ దూరంలో లేదిప్పుడు. దగ్గరకే వచ్చేసింది. ఇంత దగ్గర్లోకి వచ్చేసిందని తెలిస్తే యీపాటికే ఎప్పుడో వెళ్ళి చూసొచ్చేవాడిని. ఇప్పుడు సెలవలు లేవు. వున్న సెలవలన్నిటినీ ఎప్పుడో వాడేశాను. సంవత్సరం ఆఖరు వొచ్చేసింది. మళ్ళీ జనవరి రావాలి. రెండు నెలలు ఆగమని కామేశ్వరరావుకు వుత్తరం రాశాను. 'మరీ అంత ముక్తసరిగా వుత్తరం రాశావేం. మందాకినిని గురించి యింకా ఏమన్నా చెప్పు, వింటాను' అని రాశాను.

ఇప్పుడు యీ ఉత్తరం రాసిన పెన్ను మందాకిని ప్రెజెంట్ చేసినదే. ఏదో సందర్భంలో 'రాతగాళ్ళకు మంచి పెన్ను ఉండాలి. ముందుముందు యీ పెన్నుతో కథలవీ రాయడం అలవడుతుంది. నన్ను గురించి కూడా రాయొచ్చు. అభ్యంతరం లేదు' అని ప్రెజెంట్ చేసింది.

రాసిన మొట్టమొదటి కథ ఆమెను గురించి కాదు. బహుశా చిట్టచివరి కథ అవుతుందేమో.

కామేశ్వరరావు తన జ్ఞాపకంగా నా పోర్ట్రేట్ ఒకటి గీసిచ్చాడు. బాగా వచ్చిందది. కామేశ్వరరావు పోర్ట్రేట్ డ్రాయింగులో మంచి కృషి చేశాడు. అందుకు మందాకినే కారణం. పిలిచినప్పుడల్లా అతని ముందు వచ్చి కూర్చునేది. అతను ఆమె చిత్రం గీసేవాడు. అలా ఎన్ని బొమ్మ లేశాడో లెక్కలేదు. ఇప్పుడు ఒక్క చిత్రం కూడా మిగలలేదు. వేసిన చిత్రాలన్నల్లా పట్టుకుపోయేది, వాళ్ళింట్లో చూపిస్తానని. వాళ్ళింట్లో చిన్నపిల్లలున్నారు. వాళ్లు ఆ బొమ్మను చించేయడమో, దానిమీద పెన్సిలుతో పిచ్చిగీతలు గీసెయ్యడమో చేసేవారట. తిరిగొచ్చి కంప్లెయింట్ చేసేది. కామేశ్వరరావుకు ఎలా వుండేదో గాని నాకు మాత్రం చాలా కోపం వచ్చేది. అంత శ్రమపడి బొమ్మ వేయడం చించేయడానికా. మరీ అంత నిర్లక్ష్యమా. నేను కోప్పడేవాడిని కూడాను. 'పోనీలేవోయ్. మళ్ళీ వేస్తానంటే తనే వచ్చి కూర్చుంటుందిగా' అనేవాడు.

మందాకిని గొప్ప అందగత్తె కాదు. సన్నగా వుంటుందేమో ఆర్టిస్టుకు నచ్చుతుంది. ప్రత్యేకంగా చెప్పుకునే ఆకర్షణ ఏమీ లేదు. పదిమందిలోనూ ఒకర్తి. అందంగా వుందనుకుంటే వుంటుంది; లేదనుకుంటే లేదు.

ఒకసారి మందాకినీ స్కెచ్ నేను తీసేసుకున్నాను.

'నీ కెందుకూ?' అంది.

'కావాలి. నా దగ్గరనా్న జాగ్రత్తగా వుంటుందిలే' అన్నాను.

'నీకు స్టూడియోలో తీయించుకున్న ఫొటో యిస్తాను. ఈ డ్రాయింగు నాకిచ్చెయ్. దీనితో పనుంది. ఫ్రేము కట్టించుకోవాలి' అంది. ఇచ్చేశాను. నాకు ఆమె రాతో తీసిన ఫొటో తెచ్చిచ్చింది. ఆ తర్వాత విన్నాను—ఆ చిత్రం కూడా పిల్లల చేతుల్లో పడి చిరిగిపోయిందట.

ఏమిటో నా కర్థం కాలేదు. కామేశ్వరావు చిత్రలేఖనం మీద చిన్నచూపా? అతన్ని ఏడిపించడమా? లేక పదేపదే కామేశ్వరరావుచేత తన చిత్రాలు గీయించుకునే ప్రయత్నమా? తన అందాన్ని గుర్తింపజేయడానికి ఆమె పడేపాట్లా?... ఏమిటో ఏమీ తెలియకుండావుంది.

'చూసేవా, కామేశ్వరరావు ఎన్నిసార్లు నా చిత్రం వేశాడో. మరి నువ్వు ఒకసారన్నా నా గురించి కథ రాశావా?' అంది ఒకసారి.

అర్థమయ్యింది. తనను కామేశ్వరరావు గుర్తించాడు, నేను గుర్తించలేదని. ఆ విషయాన్ని నమ్మించడానికి ఇంత నిర్దాక్షిణ్యంగా, ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తించడం ఎందుకు?


'కామేశ్వరరావు బొమ్మలకు పట్టిన గతే నా కథకూ పడుతుందేమోనని భయం' అన్నాను నవ్వుతూ. ఆమె ముఖం మాడ్చుకుంటుందేమోనని మళ్ళీ వెంటనే 'అది కాదనుకో. నీ గురించి కథ రాస్తే నువ్వు దూరమైపోతావు. కథ కదా; కల్పనలు చేయాలి. కొసమెరుపుల గురించి లేనిది వున్నట్టు చెప్పాలి. అదంతా జీవితానికి అన్వయించుకుంటే ప్రమాదం మరి. నువ్వు చదవవని తెలిసినప్పుడో, నువ్వు బాగా దూరమై పోయినప్పుడో రాస్తాను,' అన్నాను.

'అదేమిటి! అలాంటి ఆలోచన వచ్చిందేం నీకు?' అంది.

'అవును ఎంతకాలమని మనం యిలా ఉండగలుగుతాం. ఎప్పుడో ఒకప్పుడు దూరమైపోక తప్పదు.'

'నాకు తెలుసు నీ అభిప్రాయం ఏమిటో. పెళ్ళి చేసుకుని నేను దూరమై పోతాననేగా. నేనసలు పెళ్ళే చేసుకోను' అంది.

నిజమే. అప్పటి ఆలోచనలన్నీ వేరు. ఇలాగే స్నేహితులుగా ఉండిపోవాలి. జీవనభృతి వెతుక్కోవాలి గదా. ఉద్యోగాలు చేసుకోవాలి. ఊరూరూ తిరిగే ఉద్యోగాలు వద్దు. ఎక్కడో స్థిరంగా ఉండే ఉద్యోగాలే చేయాలి. ఒకవేళ వూళ్ళల్లో పడి వెళ్లిపోతే ఎప్పుడో రిటైరయ్యాక మళ్ళీ ఒక్కచోటికి చేరుకోవాలి. నాగావళి వడ్డున ఎకరం నేల కొనుక్కుని మూడు పాకలు వేసుకోవాలి. అందులో గులాబీ తోట వేసుకుంటే చాలు, తిండికి ఎత్తుకు పోతుంది. ఆవిడేమో వంట చేసి పెడుతుంది. రోజూ తోట పని. నాగావళిలో నీళ్ళ చప్పుడూ, పూలతోటలో పక్షుల పాటలూ వింటూ గడిపేయాలి. ఏమీ తోచకపోతే ఆమె పాటలు పాడుతుంది. తనేమో పుస్తకాలు చదువుకుంటాడు. అప్పుడప్పుడు కథలు రాసుకుంటాడు. కామేశ్వరరావు బొమ్మలు గీసుకుంటాడు. మరికొంత కాలం గడుస్తుంది. ముగ్గుర్లో ఎవరో ఒకరు చచ్చిపోతారు. మిగిలిన ఇద్దరూ ఆ తోట చివర పూలచెట్ల మధ్య సమాధి చేసేస్తారు. రోజూ ఆ సమాధిమీద పూలు చల్లుతారు. వెళ్ళిపోయిన వ్యక్తి ఆలోచనలతోనే రోజంతా గడిచిపోతుంది వారికి. రాత్రిళ్లు రోజూ తోటలో ఏదో పాదాల శబ్దం విని పిస్తూ వుంటుంది. ఇద్దరూ తలుపులు తీసుకుని తోటలోకి వస్తారు. అక్కడ ఎవరూ వుండరు. కాలవనీళ్ళ చప్పుడు మాత్రం వినిపిస్తుంది. తిరిగి ఇద్దరూ వాళ్ళ పాకల్లోకి వెళ్లిపోతారు. నిద్రరాదు. ఏదో కొద్దికొద్దిగా నిద్ర; మళ్ళీ ఉదయం. మరి కొంత కాలం గడుస్తుంది. మరొకరు కూడా కన్ను మూస్తారు. మిగిలినవారు ఒక్కరే. పని చెయ్యడానికి ఉత్సాహం ఉండదు. శక్తి ఉండదు. రాత్రిళ్ళు నిద్రరాదు. ప్రతిక్షణం




తోటలోంచి పిలుస్తున్నట్టు ఉలిక్కిపడడమే. తోట ఎండిపోతుంటుంది. పక్షులు రావిక. భరించలేని నిశ్శబ్దం మిగిలిపోతుంది. జ్ఞాపకాలు కూడా మనసుకు అందవు. బ్రతకడం కూడా బాధగానే ఉంటుంది. జాలిపడినట్టుగా ఎప్పుడో ఓ పిలుపు వస్తుంది. ఉలిక్కిపడి నిద్రలోంచి లేచి తోటలోకి వెళ్ళబోతారు. ఏ రాయో తగులుతుంది. ఎండిపోయిన గులాబీ మొక్కలమీద వాలిపోతారు. అంతే. అక్కడ నిశ్శబ్దాన్ని ఏ వూపిరీ మరిక చెదర్చలేదు.

—ఇలా ఎన్నో ఆలోచనలు. కలల్లాంటి ఆలోచనలు.

కలల మత్తులోనే ఆ రోజులు వెళ్లిపోయాయి. ఇప్పుడు జ్ఞాపకాలు మాత్రమే మిగిలిపోయాయి. మరికొంతకాలం పోతే ఆ జ్ఞాపకాలు కూడా మిగలవేమో.

కామేశ్వరరావుకు ఉత్తరం రాసిన నాలుగు రోజులకు అతని దగ్గర్నుంచి సమాధానం వచ్చింది.

"......ఏముంది మందాకినిని మొట్టమొదట నేను చూడలేదు. తనే చూసి పలకరించింది. గంటకన్న ఎక్కువ కలిసి వుండలేదు. ఆ పిల్లలూ, టీచర్లూ - వీళ్ళ మధ్య ఒంటరివాడ్నయిపోయాను. 'ఇంకా చెయ్యి కాల్చుకుంటున్నావా' - అంది నన్ను. అవునన్నాను. నిన్నుగురించి కూడా అదే ప్రశ్న అడిగింది. చెప్పాను. చాలా విచారంగా కనిపించింది ఆ క్షణం. ఏమీ మాట్లాడలేదు. చాలాసేపు వూరుకుని ఓ నిట్టూర్పు మాత్రం తీసింది. ఎందుకో అర్థం చేసుకోగలవుగా. నేనే అడిగాను - యింతదగ్గరకు వచ్చికూడా కనీసం ఓ ఉత్తరం ముక్కనా్న రాయలేదేం అని. మమ్మల్ని మర్చిపోయావ్ అనటంతో చాలా నొచ్చుకుంది. ఎంత నొచ్చుకుందంటే, ఆమె కళ్ళు చెమ్మగిల్లాయనికూడా గుర్తించగలిగాను. మనిద్దర్నీ ఒకసారి రమ్మంది. అడ్రసు యిచ్చింది. ఆరు నెలలైందట వుద్యోగంలో చేరి. మీ ఆయనకు ట్రాన్స్‌ఫర్ అయ్యిందా అని అడిగాను. అవ్వలేదుగానీ అవ్వొచ్చు అంది. నిన్ను అచ్చులో చూస్తున్నట్టు చెప్పింది. తనమీద నువ్వు కథ రాశావేమో అడిగింది. నాకెందుకో ఆమె చాలా కొత్తగా కనిపిస్తోంది. వెనకటి వుత్సాహంలేదు. మాటలుకూడా తూచి తూచి మాట్లాడుతోంది. పెళ్ళితో చిలిపితనమూ, మొండితనమూ ఒదిలి వెళ్ళిపోయాయిలే; కాని, ఒక విధమైన నిర్లిప్తత ఏర్పడింది. ఏమిటోమరి. ఒకసారి వెళ్ళొద్దాం. రెండు నెలలు పొడిగించా

వేమిటి? ఈమధ్యలోనే రావడానికి ప్రయత్నించు..."

ఇంకా అసంతృప్తిగానే వుండిపోయింది. తన కొత్తజీవితాన్నిగూర్చి ఆమె ఏమీ చెప్పలేదా? మా ఒంటరిజీవితం మీద ఆమె ఏమీ వ్యాఖ్యానాలు చెయ్యలేదా? ఎందుకింత మౌనంగా వుండిపోయింది.

బహుశా కొత్తజీవితంలో నిలుచుని మాట్లాడాలంటే సిగ్గుగావుంది గాబోలు.

పెళ్ళి చేసుకోనని పదేపదే చెప్పి అకస్మాత్తుగా పెళ్ళి చేసేసుకుంది మందాకిని. అప్పటికి ముగ్గురమూ ఒకచోట కూడా లేము. మొట్టమొదట వూరు విడిచి వెళ్ళినవాడు కామేశ్వర్రావు. వాళ్ళ నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయితే వెళ్ళిపోయాడు. ఆతర్వాత రెండేళ్ళకి ఉద్యోగరీత్యా నేను దూరంగా వచ్చేయాల్సివచ్చింది. కొంతకాలానికి మందాకినీవాళ్లు కూడా వెళ్ళిపోయారు. వెళ్ళిపోయిన ఏడాదికి పెళ్ళయి భర్తతో పాటు మరీదూరంగా వెళ్ళిపోయింది.

ఇలా చెదిరిపోవడంవల్లనే ఆమె తన అభిప్రాయాన్ని మార్చుకుని వుండాలి. పెళ్ళికిముందు పెళ్ళివిషయాన్ని తెలియజేస్తూ, అందుకు సంజాయిషీ యిచ్చుకుంటున్నట్టు పెద్ద వుత్తరం రాసింది.

"......రోజులు గడిచేకొద్దీ జీవితంలో వెలితి కనిపించడం మొదలెట్టింది. కొంతకాలంపాటు ఆ వెలితి ఏమిటో అర్థం కాలేదు. తర్వాత తర్వాత తెలుసుకున్నాను. 'నాకు జ్వరం వచ్చింది,చూడాలనివుంది, రండి అంటే నువ్వూ, కామేశ్వర్రావూ పరుగెట్టుకొస్తారు. దిగులుగా నా ముందు కూర్చుంటారు. మందు తాగిస్తారు. నా కళ్ళల్లోకి చూస్తూవుండిపోతారు. నేను బాధపడుతుంటే, అయ్యో అనుకుంటారు. కళ్ళల్లో నీళ్ళు నింపుకుంటారు. అప్పుడు – 'నా కేమీ అక్కరలేదు, ఈమాత్రం చాలు' అనుకుంటాను. కాని ఆ మరుక్షణం దిగులు పడిపోతాను. 'ఈ కన్నీళ్ళు, ఈ సానుభూతి నాకొరకే, నావొక్కదానికొరకే. మరింకెవరికొరకూ రాలేవు. నా స్వంత ఆస్థి'– అని అనుకోలేకపోతాను. నేను పాట పాడుతాను. ఆనందంతో బావుంది అంటారు. మెచ్చుకుంటారు. మీ యీ మెప్పు, యీ ఆనందం–యివి నావే, మరెవరికీకావు అనుకోలేను. ఈ వెలితి యిటీవల మరీ ఎక్కువయిపోయింది. ఒకచోటే వుంటామనుకున్న ముగ్గురం చెల్లాచెదరైపోయాం. ఒక్కర్తినీ అయిపోయాను. అందువల్ల యీ ఆలోచనలు మరీ ఎక్కువైపోయాయి...!"

—ఇలా సాగింది ఆమె అప్పుడు రాసిన వుత్తరం.

ఆమె దూరమైపోతుందన్న ఆలోచన బాధగానే వుంది. వెనకటంత స్వేచ్ఛ యిప్పుడు వుండదు. అప్పటి అభిమానాలు కూడా యిప్పుడు నిలిచిపోవు. ఆమె చిరునవ్వులు, ఆమె కన్నీళ్ళు మరొకరి ఆస్థి. మా గురించి ఆమె వాటిని ఖర్చుపెట్టదు. వెనకటిలా సన్నిహితంగా వుండలేదన్న విషయాన్ని ముందు వూహించుకునే ఆమెను ఒకసారి చూసివద్దామనుకున్నాను.

ఇదిగో అదిగో అనుకుంటూనే సంక్రాంతి వచ్చేసింది. మరో నాలుగు రోజులు సెలవు పెట్టి, మొత్తం వారం రోజులు అయ్యేటట్టు చూసుకుని, పండగకు యింటికి వెళ్ళాను. మందాకిని దగ్గరకు కూడా వెళ్ళొద్దామని, కామేశ్వర్రావుకు వుత్తరం రాశాను.

పండగ నాలుగురోజులూ యింటిదగ్గరే వున్నాను. పండుగ రోజులు హాయిగా గడిచిపోయాయి. ఈ పండుగ పూటకూడా అమ్మకళ్ళల్లో దిగులెందుకో నాకు తెలుసు. అభిమానంతోనైనా ఆజ్ఞాపించడం తెలీదు అమ్మకు. అందుకే ఆ మౌనం.

'హోటలు భోజనంతో ఎలా అయిపోయావో చూడూ!' అంది. అదేచాలు; ఆమె చెప్పదలచుకున్నది చెప్పేసిందనడానికి.

రాత్రి భోజనం చేస్తున్నపుడు చెప్పాను– రేపు ఉదయం మందాకినిదగ్గరకు వెళ్తానని.

'అలాగే, వెళ్ళిరా. వాళ్ళమ్మగార్ని అడిగినట్టు చెప్పు. పాపం యీ వయసులో ఆమెకు యీ కష్టం వొచ్చిపడింది. ఆ పిల్ల అదృష్టం అది. ఏం చెయ్యగలం, అయ్యో! అనుకోవడం తప్ప.'

గతుక్కుమన్నాను. ఏమయింది? ఆమె మాంగల్యం...

'ఏం జరిగిందేమిటి?'

'నిజం ఎంతుందోగాని మొగుడు ఏలుకోడంలేదట.వీధిలోవాళ్లు చెప్పుకున్నారు. అయినా మన వీధిలో మరీలెస్తూ. కాస్త ఎడముఖం పెడముఖంగా వుంటే వున్నవీ లేనివీ పుట్టించడమే,' అంది.

అన్నం తినలేకపోయాను.

ఏమిటిది? వొదిలేయడమా? పోట్లాడుకుని వచ్చేయడమా? అభిప్రాయ భేదాలతో విడిపోవడమా?

అంతకన్న విశేషాలు అమ్మ చెప్పలేకపోయింది.

రాత్రంతా నిద్రలేదు. మనసంతా గాయపడ్డట్టు బాధ.

ఎందు కిలా జరిగింది?

ఆమెకు యిష్టంలేని పెళ్ళి కాదిది. ఆమె అంగీకారాన్నికూడా తీసుకునే యీ పెళ్ళి జరిపించారు. అతనుకూడా మంచివాడేనని చెప్పుకున్నారు. ఖర్గపూర్‌లో రైల్వేలో వుద్యోగం. మూడొందలవరకూ వస్తుందట. పెళ్ళికి వెళ్ళినప్పుడు చూశాను. మందాకిని అదృష్టవంతురాలేనని అనిపించింది. కామేశ్వర్రావుమాత్రం రాలేకపోయాడు. అప్పటికి అతను బాగా జ్వరంలో ఉన్నాడు–నూటమూడు డిగ్రీల జ్వరం. అతన్ని వొదిలిపెట్టా లనిపించలేదు. సాయంకాలానికి కొద్దిగా తగ్గింది. 'నువ్వు కూడా వెళ్ళకపోతే బావుండదు;

ఇప్పుడే బయలుదేరుదాం, పద అని లేచాడు. బస్సుస్టేండుకు చేరుకునేసరికి బస్సు సిద్ధంగా వుంది.

చీకటి పడుతూ పడుతూ వుండగా శ్రీకాకుళం చేరుకున్నాం.

మందాకినీని ఎలా పలకరించాలీ అన్నది ఒక సమస్య. పుట్టెడు దిగులుతో వున్న ఆమెను సరదాగా పలకరించడానికి వీలవుతుందా? ఎలా ఆమెను ఓదార్చాలి? ఎలా మాట్లాడాలి?

మా ఇద్దర్నీ చూసి మందాకిని ముఖం యింత చేసుకుంది. "కామేశ్వర్రావు కలిసిన తర్వాత పది-పదిహేను రోజులపాటు ఎదురుచూశాను, వస్తారేమోనని. ఇంక రారని నిశ్చయించుకున్నాక అకస్మాత్తుగా వూడిపడ్డారు రండి...రండి" అంది.

ఇంటిల్లిపాదికీ మేం వచ్చినట్టు చెప్పేసింది. ఆ సంతోషం మాకే ఆశ్చర్యం వేసింది. నేను వూహించుకున్నట్టులేదు ఆమె. కనీసం కామేశ్వర్రావు చెప్పినట్టయినా నా కనిపించలేదు. ఈ చిరునవ్వు వెనక ఈ సంతోషం వెనక కన్నీటితో తడిసిన ఆమె జీవితం కనిపిస్తోంది నాకు.

"ఏం......ఇంత మౌనంగా వుండిపోయారు. మాటలు మర్చిపోయారా ఏమిటి?" అంది భోజనం వడ్డిస్తున్నప్పుడు.

ఆమెతోపాటు మేంకూడా సరదాగా మాట్లాడితే ఆమె నొచ్చుకోకుండా వుంటుందా? తనను తాను దాచుకుని నటిస్తోంది. ఆమె నవ్వే ప్రతి చిరునవ్వు వెనకా ఓ కన్నీటిబొట్టన్నా కదలకపోదు. ఆమెతోపాటు మేమూ అలాగే మాట్లాడితే ఆమె హృదయం గాయపడక మానదు.

"బాగా మారిపోయారు మీ రిద్దరూ. నేను ఎలా వూహించుకున్నానో అలానే కనిపిస్తున్నారులెండి," అంది తిరిగి.

మరీ మౌనంగా వుండిపోవడం యిష్టం లేక నేనే అవీ యివీ చెప్పుకొచ్చాను- మా ఉద్యోగాలు, అక్కడి పరిస్థితులు, ఇంటిదగ్గరి విశేషాలగురించి చెప్పాను. ఎక్కడా ఆమె వైవాహిక జీవితానికి సంబంధించిన విషయాలు జారకుండా జాగ్రత్తపడి, భోజనం అయిపోయాక కూడా చాలాసేపు కూర్చుని మాట్లాడుకున్నాం.

వాళ్ళమ్మగారుకూడా చాలా సేపు అక్కడి వూళ్ళో విషయాలు అడుగుతూ కూర్చున్నారు. మందాకినిలో లేని దిగులు ఆమెలో కనిపించింది నాకు. మందాకిని పక్కలు పరుద్దామని అవతలి గదిలోకి వెళ్ళినప్పుడు వాళ్ళమ్మగార్ని అడిగాడు కామేశ్వర్రావు- "ఇంతకూ ఏం జరిగిందండి. ఇద్దరూ పోట్లాడుకున్నారా? ఒకసారి మీరన్నా వుత్తరం రాయించలేకపోయారా. మీకు తెలీని దేముంది; మందాకిని మరీ పట్టుదల మనిషి. కోప్పడి మీరే ఆమెచేత వుత్తరం రాయించాల్సింది."

ఈ విషయం ఎలా తెలుసా అన్నట్టుగా ఓ క్షణం ఆమె ఆశ్చర్యాన్ని ప్రకటించింది. "నాకు మాత్రం ఏం తెలుసు నాయనా ఏం జరిగిందో. అడిగితే చెప్పదు. ఒకరోజు, ఉత్తరం ముక్కన్నా రాయకుండా, వూడిపడింది. ఏమిటే అంటే ఏమీలేదు, చూద్దామని వచ్చాను అంది. వచ్చిన రెండునెలలకు ఉద్యోగం చెయ్యాలనివుందని యిందులో చేరింది. అక్కడికి నేను పిల్లవాడిచేత వుత్తరం రాయించాను. 'మీ అమ్మాయిని అడగండి, చెప్తుంది,' అని రాశారు అల్లుడుగారు..."

అంతే అయివుంటుంది. ఏదో చిన్న విషయంమీద అభిప్రాయభేదాలు వచ్చుంటాయి. ఆయన తన ఆధిక్యతను చూపించుకోవడానికి ఏదో అనుంటాడు. ఆమె వెనకా ముందూ చూడకుండా ఏదో అనేసి వుంటుంది. అది చిలికి చిలికి గాలివాన అయ్యుంటుంది. చెప్పా చెయ్యకుండా పుట్టింటికి వచ్చేసి వుంటుంది. పిలిస్తేనే గాని వెళ్ళగూడదనుకుని వుండిపోయి వుంటుంది.

పక్కలు వేశాను, పడుకుంటారా, కాసేపు కూర్చుని కబుర్లు చెప్పుకుందామా," అంటూ వచ్చింది మందాకిని.

రాత్రి పన్నెండువరకూ కూర్చున్నాం. చిన్నప్పటి విషయాలు జ్ఞాపకం చేయడానికి భయం వేసింది నాకు. మందాకినే వాటిని ప్రస్తావించింది. చిన్నపిల్లలా అయిపోయి ఆ రోజుల్ని జ్ఞాపకం చేసింది. ఉసిరికాయలు, బాదంకాయలు కోసుకుతిన్నప్పటి అనుభవాలూ, కామేశ్వర్రావు చెట్టెక్కలేని నిస్సహాయత కారణంగా కింద ఏరుకున్న కాయల్తో మాకన్నా ఎక్కువే పోగుజేసుకునే అతని అతితెలివీ, చిటారు కొమ్మమీదకుకూడా ఎగబాకిపోయే నా మొండి సాహసమూ, సంగీత సాధనగురించి తెల్లారుఝామే లేద్దామని లేవలేని తన మొద్దునిద్రా - ఆ సంఘటనలూ, ఆ అనుభవాలూ మరీ మరీ జ్ఞాపకం చేసుకుని చెప్పింది.

కామేశ్వర్రావు నిద్రకు ఆగలేక జోగుతోంటే యిక పడుకుందామని లేచాం. గతరాత్రి సరిగా నిద్ర లేదేమో నాకుకూడా మత్తుగా నిద్రపట్టేసింది.

ఉదయం లేచేసరికి చాలా ఆలస్యమయ్యింది. అప్పటికే కామేశ్వర్రావు కాలకృత్యాలు ముగించుకుని కూర్చున్నాడు. "లేవోయ్, చాలా పొద్దెక్కిపోయింది. పరాయిచోటకూడా యింతసేపు నిద్రపోవడమేనా!" అన్నాడు.

ఎక్కడ్నించి విన్నదోగాని మందాకిని గబగబా వచ్చి "చూసేవా, కామేశ్వర్రావు ఎప్పుడూ యింతే. ఇది పరాయిచోటు అనుకునేంత దూరమైపోయానా నేను. ఎందుకలా నన్ను దూరం దూరంగా వుంచేసి మాట్లాడుతావు. నిన్నటినించీ చూస్తూనే వున్నాను - మరీ ముభావంగా వుండిపోయావు," అంది.

ఇదేమిటి! ఇంత పొద్దుటే యిలా కనిపిస్తోం దేమిటి. బహుశా రాత్రల్లా నిద్రపోయి వుండదు. ఆలోచనల్తో గడిపేసి

ఇప్పుడే బయలుదేరుదాం, పద అని లేచాడు. బస్సుస్టేండుకు చేరుకునేసరికి బస్సు సిద్ధంగా వుంది.

చీకటి పడుతూ పడుతూ వుండగా శ్రీకాకుళం చేరుకున్నాం.

మందాకినీని ఎలా పలకరించాలీ అన్నది ఒక సమస్య. పుట్టెడు దిగులుతో వున్న ఆమెను సరదాగా పలకరించడానికి వీలవుతుందా? ఎలా ఆమెను ఓదార్చాలి? ఎలా మాట్లాడాలి?

మా ఇద్దర్నీ చూసి మందాకిని ముఖం యింత చేసుకుంది. "కామేశ్వర్రావు కలిసిన తర్వాత పది-పదిహేను రోజులపాటు ఎదురుచూశాను, వస్తారేమోనని. ఇంక రారని నిశ్చయించుకున్నాక అకస్మాత్తుగా వూడిపడ్డారు రండి...రండి" అంది.

ఇంటిల్లిపాదికీ మేం వచ్చినట్టు చెప్పేసింది. ఆ సంతోషం మాకే ఆశ్చర్యం వేసింది. నేను వూహించుకున్నట్టులేదు ఆమె. కనీసం కామేశ్వర్రావు చెప్పినట్టయినా నా కనిపించలేదు. ఈ చిరునవ్వు వెనక ఈ సంతోషం వెనక కన్నీటితో తడిసిన ఆమె జీవితం కనిపిస్తోంది నాకు.

"ఏం......ఇంత మౌనంగా వుండిపోయారు. మాటలు మర్చిపోయారా ఏమిటి?" అంది భోజనం వడ్డిస్తున్నప్పుడు.

ఆమెతోపాటు మేంకూడా సరదాగా మాట్లాడితే ఆమె నొచ్చుకోకుండా వుంటుందా? తనను తాను దాచుకుని నటిస్తోంది. ఆమె నవ్వే ప్రతి చిరునవ్వు వెనకా ఓ కన్నీటిబొట్టన్నా కదలకపోదు. ఆమెతోపాటు మేమూ అలాగే మాట్లాడితే ఆమె హృదయం గాయపడక మానదు.

"బాగా మారిపోయారు మీ రిద్దరూ. నేను ఎలా వూహించుకున్నానో అలానే కనిపిస్తున్నారులెండి," అంది తిరిగి.

మరీ మౌనంగా వుండిపోవడం యిష్టం లేక నేనే అవీ యివీ చెప్పుకొచ్చాను-మా ఉద్యోగాలు, అక్కడి పరిస్థితులు, ఇంటిదగ్గరి విశేషాలగురించి చెప్పాను. అక్కడి ఆమె వైవాహిక జీవితానికి సంబంధించిన విషయాలు జారకుండా జాగ్రత్తపడి, భోజనం అయిపోయాక కూడా చాలాసేపు కూర్చుని మాట్లాడుకున్నాం.

వాళ్ళమ్మగారుకూడా చాలాసేపు అక్కడి వూళ్ళో విషయాలు అడుగుతూ కూర్చున్నారు. మందాకినిలో లేని దిగులు ఆమెలో కనిపించింది నాకు. మందాకిని పక్కలు పరుద్దామని అవతలి గదిలోకి వెళ్ళినప్పుడు వాళ్ళమ్మగార్ని అడిగాడు కామేశ్వర్రావు- "ఇంతకూ ఏం జరిగిందండి. ఇద్దరూ పోట్లాడుకున్నారా? ఒకసారి మీరన్నా వుత్తరం రాయించలేకపోయారా. మీకు తెలీని దేముంది; మందాకిని మరీ పట్టుదల మనిషి. కొప్పడి మీరే ఆమెచేత వుత్తరం రాయించాల్సింది."

ఈ విషయం ఎలా తెలుసా అన్నట్టుగా ఓ క్షణం ఆమె ఆశ్చర్యాన్ని ప్రకటించింది. "నాకు మాత్రం ఏం తెలుసు నాయనా ఏం జరిగిందో. అడిగితే చెప్పదు. ఒకరోజు, ఉత్తరం ముక్కన్నా రాయకుండా, వూడిపడింది. ఏమిటే అంటే ఏమీలేదు, చూద్దామని వచ్చాను అంది. వచ్చిన రెండు నెలలకు ఉద్యోగం చెయ్యాలనివుందని యిందులో చేరింది. అక్కడికి నేను పిల్లవాడిచేత వుత్తరం రాయించాను. 'మీ అమ్మాయిని అడగండి, చెప్తుంది,' అని రాశారు అల్లుడుగారు..."

అంతే అయివుంటుంది. ఏదో చిన్న విషయంమీద అభిప్రాయభేదాలు వచ్చుంటాయి. ఆయన తన ఆధిక్యతను చూపించుకోవడానికి ఏదో అనుంటాడు. ఆమె వెనకా ముందూ చూడకుండా ఏదో అనేసి వుంటుంది. అది చిలికి చిలిక గాలివాన అయ్యుంటుంది. చెప్పా చెయ్యకుండా పుట్టింటికి వచ్చేసి వుంటుంది. పిలిస్తేనే గాని వెళ్ళగూడదనుకుని వుండిపోయి వుంటుంది.

పక్కలు వేశాను, పడుకుంటారా, కాస్సేపు కూర్చుని కబుర్లు చెప్పుకుందామా,'' అంటూ వచ్చింది మందాకిని.

రాత్రి పన్నెండువరకూ కూర్చున్నాం. చిన్నప్పటి విషయాలు జ్ఞాపకం చేయడానికి భయం వేసింది నాకు. మందాకినే వాటిని ప్రస్తావించింది. చిన్నపిల్లలా అయిపోయి ఆ రోజుల్ని జ్ఞాపకం చేసింది. ఉసిరికాయలు, బాదంకాయలు కోసుకుతిన్నప్పటి అనుభవాలూ, కామేశ్వర్రావు చెట్టెక్కలేని నిస్సహాయత కారణంగా కింద ఏరుకున్న కాయల్తో మాకన్నా ఎక్కువే పోగుజేసుకునే అతని అతితెలివీ, చిటారు కొమ్మమీదకుకూడా ఎగబాకిపోయే నా మొండి సాహసమూ, సంగీత సాధనగురించి తెల్లారుఝామే లేద్దామని లేవలేని తన మొద్దునిద్రా - ఆ సంఘటనలూ, ఆ అనుభవాలూ మరీ మరీ జ్ఞాపకం చేసుకుని చెప్పింది.

కామేశ్వర్రావు నిద్రకు ఆగలేక జోగుతోంటే యిక పడుకుందామని లేచాం. గతరాత్రి సరిగా నిద్ర లేదేమో నాకుకూడా మత్తుగా నిద్రపట్టేసింది.

ఉదయం లేచేసరికి చాలా ఆలస్యమయ్యింది. అప్పటికే కామేశ్వర్రావు కాలకృత్యాలు ముగించుకుని కూర్చున్నాడు. "లేవోయ్, చాలా పొద్దెక్కిపోయింది. పరాయిచోటకూడా యింతసేపు నిద్రపోవడమేనా!" అన్నాడు.

ఎక్కడ్నించి విన్నదోగాని మందాకిని గబగబా వచ్చి "చూసేవా, కామేశ్వర్రావు ఎప్పుడూ యింతే. ఇది పరాయి చోటు అనుకునేంత దూరమైపోయానా నేను. ఎందుకలా నన్ను దూరం దూరంగా వుంచేసి మాట్లాడుతావు. నిన్నటినించీ చూస్తూనే వున్నాను - మరీ ముభావంగా వుండిపోయావు," అంది.

ఇదేమిటి! ఇంత బాధ్యుంటే యిలా కనిపిస్తోం దేమిటి. బహుశా రాత్రల్లా నిద్రపోయి వుండదు. ఆలోచనల్తో గడిపేసి

వుంటుంది. తన జీవితాన్ని తలచుకుని తనమీద తనకే కోపం వచ్చుంటుంది. బాధకల్గివుంటుంది. అది యిలా పొర్లిపోతోంది. అదిగో రాత్రి నిద్ర లేనట్టు ఆ కళ్ళల్లో ఎరుపు.

“ఏం, కోపం వచ్చిందా ... సర్లే యిప్పుడు నా మీద అందరికీ కోపమే. ఎప్పుడూ నువ్వు నాతో వాదన వేసుకునే వాడివిగా. ఇప్పుడిలాగ మూగనోము పడితే ఏమిటోలా వుంది. నీతో కాస్సేపు పోట్లాడా లనిపించిందిలే, అంతే – మరేం లేదు,” అంది అంతలోనే కంఠాన్నీ, చూపుల్నీ మార్చుకుని మెల్లగా నవ్వుతూ.

మేం వచ్చి ఆమెను మరీ బాధపెడుతున్నామేమో అనిపించింది నాకు. ఈ పరిస్థితుల్లో ఆమెను చూడకుండావుంటేనే బావుండేది. మా గురించి తనను తాను దాచుకోవాల్సివస్తోంది ఆమెకు. మా రాక ఒకవిధంగా ఆమెను రెచ్చగొట్టడమే. మేం వెళ్ళిపోయాక ఒక రోజల్లా ఆమె ఏడుస్తూ వుంటుందనేది నిజం.

ఎక్కువసేపు అక్కడ వుండాలనిపించ లేదు. ఆ సాయంకాలం బస్సుకే వెళ్ళిపోదామని నిశ్చయించుకున్నాం. మందాకినితో చెప్తే వొప్పుకోలేదు. వాళ్ళమ్మగారు కూడా మరోరోజు వుండమని బలవంతం చేశారు. ఆఫీసు సాకు చెప్పి తప్పించుకున్నాం. మందాకినికి నామీద కోపం కూడా వచ్చింది.

ఆ రోజు ఆమె స్కూలుకు సెలవు పెట్టేసింది.

పదిగంటలవేళ అలా వూళ్ళో కాస్సేపు తిరిగివస్తామని అంటే వెళ్ళనిచ్చిందికాదు. “ఎలాగూ సాయంకాలం వెళ్ళిపోతున్నారుగా, ఈ కొద్దిసేపైనా యింట్లో వుండకుండా ఎక్కడికి?” అంది కోపంగానూ, ఆజ్ఞాపూర్వకంగానూ; అనేసరికి మారు మాట్లాడలేకపోయాం.

“రండి, ఇంకా నిలుచున్నారేం... ఇలా వచ్చి కూర్చోండి.”

అవును. ఈ కంఠంతోనే తన జీవితాన్ని తాను నాశనం చేసుకుంది.

గదిలో కూర్చున్నాం. చెప్పుకోవడానికి ఏమున్నాయి. పొడిపొడిగా ప్రసంగం నడుస్తోంది. మాట్లాడుకున్నదానికన్న మౌనమే ఎక్కువ.

“నువ్వు వెళ్ళిపోయేలోగా నీతో గట్టిగా పోట్లాడేయాలనివుంది కామేశ్వర్రావ్. మరీ యింత మౌనంగా మీ వూరికి నిన్ను పంపేయ దలచుకోలేదు,” అంది మందాకిని.

“అవును. నాకూ అలానేవుంది. నీతో పోట్లాడిగాని యిక్కడ్నించి కదలాలనిపించడంలేదు,” అన్నాడు కామేశ్వర్రావు.

“దేనిగురించి పోట్లాడుదామనుకుంటున్నాన్?”

“నీ గురించే.”

“నా గురించి నాతోనే పోట్లాడ్డమేమిటి? అది పోట్లాటనిపించుకోదు.”

“పోట్లాట కాకపోతే మరోటి. ఏవేరైతేనేం. ఏ రాయైనా ఒకటే పళ్ళూడగొట్టుకోడానికి.”

మందాకిని చిరునవ్వు నవ్వి, “ఇప్పటికి చూశాను మా పాత కామేశ్వర్రావుని,” అంది.

నాకు నవ్వొచ్చింది. కామేశ్వర్రావు మాత్రం సీరియస్‌గా ముఖం పెట్టి, “పంతాలు పట్టి నీ జీవితాన్ని నువ్వే చేజేతులా ఎందుకు నాశనం చేసుకుంటావ్?” అన్నాడు.

“ఏమిటిటా!” అంది ఆమె చాలా చిలిపిగా అతనివైపు చూస్తూ.

అతను సూటిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

ఆమె రెప్పలు వాల్చేసుకుంది.

“ఎందుకా నటన? నా కేమీ తెలీదనుకోకు. ఆ మాట అనడానికి నిన్ను నువ్వు ఎంత హింసించుకుంటున్నావో నాకు తెలుసు.”

ఆమె ఏమీ మాట్లాడలేదు.

“అవును మందాకినీ! నువ్వు చాలా తెలివితక్కువగా ప్రవర్తిస్తున్నావు. చిన్నప్పుడు పంతాలు పట్టినా అందం వుంది. పెద్దయ్యాక పంతాలు పడితే—అది జీవితానికే ప్రమాదకరంగా పరిణమించవచ్చు. సంసారం అన్నతర్వాత అభిప్రాయభేదాలు రాకుండాపోవు. మాటా మాటా అనుకోకుండా వుండరు. అంతమాత్రంచేత నువ్విలా ప్రవర్తించడం మా కేమీ నచ్చలేదు. నీ ఆలోచనలు నీకే శత్రువులవుతాయని వెనక చెప్పాను. అది నిజమనిపించావు. వైవాహిక విషయాలలో నీకు సలహా యిచ్చేపాటి అర్హతలు మాకు లేవు. సలహాలు కూడా యివ్వదలచుకోలేదు. కాని ఒక విషయం చెప్పక తప్పదు. నువ్వు చేసిన పని మాత్రం మంచిపని కాదు,” అన్నాను.

“చివరికి మీ రిద్దరూ కూడా నన్ను తప్పు పట్టుతున్నారా?” అంది—ఏడుపూ, నిరాశా నిండిన కంఠంతో జాలిగా అడిగినట్టుందది.

“నిజమే. నీది తప్పు కాకపోవచ్చు. అతనిదే తప్పు కావచ్చు. అంతమాత్రంచేత యీ పట్టుదల లేమిటి. పరిస్థితులతో రాజీ పడలేకపోతే యీ దేశంలో స్త్రీ సుఖానికి నోచుకోలేదని నీకు తెలిదా!” అన్నాడు కామేశ్వర్రావు.

ఆమెకు ఏడుపు ఆగలేదు. పెదాలు బిగబెట్టి దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నించింది గాని సాధ్యంకాలేదు. రెండు చేతుల్తోనూ ముఖాన్ని కప్పుకుని కూచుంది. ఓ నిమిషం అలా కూచుని మెల్లగా లేచి వెళ్ళి ఓ కాగితం తెచ్చి “నన్ను నేను చంపుకుని ఆయనకు రాసిన ఉత్తరం నకలు యిది. ఇంతకన్నా పరిస్థితులతో రాజీ పడడం ఎలాగ?” అంది.

కామేశ్వర్రావు ఆ కాగితం అందుకుని చదువుకుని మౌనంగా నా చేతి కిచ్చాడు.

‘శ్రీవారి పాదపద్మములకు మీ మందాకిని నమస్కరించి వ్రాయునది—

మీ కోపం తాత్కాలికమైనదేనని రెండు నెలలు నిరీక్షించాను. ఎప్పుడో ఓ చల్లటి ఉత్తరం మీ దగ్గర్నుంచి వస్తుందనే ఎదురు చూశాను. కాని మీకు నా మీద దయ కలగలేదు. మీ చల్లని నీడకింద అదృష్టవంతురాలిగా మురిసిపోతోన్న నాకు ఆ అదృష్టాన్ని దూరం చేయకండి. మీ హృదయంలో యింత కాఠిన్యం వుండడానికి వీలులేదు. అది ఎంత మెత్తనైనదో నాకు తెలుసు. తాత్కాలికమైన ఆవేశంతో మీరన్న మాటల్ని నిజంగా మీ హృదయంలోనుంచి వచ్చినవనుకోను. నా మీద కోపంతోగాక సానుభూతితో ఆలోచించండి. నన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. మీరురుద్దిన అభాండంతో ఏ స్త్రీ కూడా ఇంకా బ్రతకా లనుకోదు. మీరు పరిస్థితుల్ని సావకాశంగా మరోసారి ఆలోచిస్తారనీ, నాకు అన్యాయం చెయ్యరనీ నాకు తెలుసు. అందుకే ప్రతి రోజూ నిరీక్షణలతోనే గడుపుతున్నాను. నేను స్త్రీని. నా పైన ఇంత కఠినంగా ప్రవర్తిస్తే యిక నాకు దిక్కేమిటి? మీ హృదయంలోంచి ఒక చల్లని పలుకు, ఒక చల్లని చూపు, ఒక చల్లని మాట జాలితో నా పైన కురుస్తుందన్న ఆశతోనే ఇంకా బ్రతికిఉన్నాను. ఆ అదృష్టాన్ని నాకు ప్రసాదించండి.

మీ చరణదాసి
మందాకిని.'

నేనెరిగిన మందాకిని కాదు. శాసించడమేగాని శిరసావహించడం తెలీని మందాకిని, మొండిగా తను చెప్పడమే గాని ఆలకించడం తెలీని మందాకిని యింత జాలిగా, బిచ్చగత్తెలా యాచించే ముందు తనను తాను ఎంతగా హింసించుకుని వుండాలి. మందాకిని ఇలా యాచించగలదని నేను ఎప్పుడూ అనుకోలేదు. మొదటినుంచీ తన వ్యక్తిత్వాన్నే ప్రదర్శించుకోవడానికి అలవాటుపడింది. ఆ వ్యక్తిత్వ ప్రదర్శనకే పెళ్ళికూడా చేసుకోగూడదని ఆలోచించింది. ఆ మందాకినీయేనా యీమె?

ఆయన సమాధానం ఏం రాశాడో అడగడం అనవసరం. మందాకిని యీ వుత్తరం రాసి ఎనిమిది నెలలయ్యింది. ఏం రాసివుంటాడో వూహించవచ్చు.

"అసలు ఏం జరిగింది?" అన్నాడు కామేశ్వర్రావు.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఏది జరిగితే స్త్రీ సహించలేదో, ఏది జరిగితే ఆమె యిక బ్రతకలేదో అదే జరిగుంటుంది.

మందాకిని ఒకసారి చెంగుతో కళ్ళు తుడుచుకుని "కామేశ్వర్రావ్! ఏవైనా విశేషాలు చెప్పు వింటాను – నా సొద ఏం వింటావుగాని. నేను బాధపడడం చాలక మిమ్మల్నికూడా బాధపెట్టడం దేనికి?" అంది.

ఇంత దుఃఖంలోకూడా ఎంతవోర్పు! ఇంతబాధలోకూడా ఎంత సహనం!!

ఏం మాట్లాడగలం? ఏం మాట్లాడినా అది ఆమె హృదయాన్ని తూట్లుపరచేట్టు వున్నప్పుడు నోరు ఎలా మెదిపేది? మా కళ్ళముందే ఆమె చిత్రహింస లనుభవిస్తోంటే ఎలా భరించేది? పెదవి కదపడానికే భయంగా వుంది.

"ఏమిటలా మూగనోము పట్టారు. ఇక్కడ కూర్చోవడం ఇబ్బందిగా వుందా. పోనీ అలా ఊళ్ళో తిరిగిరండి. బలవంతంగా కూర్చోవడం దేనికి?" అంది.

హమ్మయ్య అనుకుని బయటపడ్డాం. భోజనం టైమువరకూ అలా వూళ్ళోనే తిరిగాం. ఒకగమ్యంలేదు–వట్టినే వీధుల్ని కొలుస్తూ తిరగడంతప్ప. మందాకిని ఎదుటినుంచి తప్పుకోడానికి ఎలా గడిపితేనేం. కాళ్ళు నొప్పెట్టేవరకూ తిరిగితిరిగి ఒంటిగంటకు ఇంటికి చేరుకున్నాం.

"ఇంతసేపా. ఇందాకటినుంచీ ఎదురు చూస్తున్నాను. బ్రతుకంతా ఇలానిరీక్షణలతోనే గడిచిపోతుంది. ప్రతి చిన్న విషయానికి, పెద్దవిషయానికీ నిరీక్షణలు నాకు తప్పడంలేదు," అంది మందలిస్తున్నట్టు.

భోజనం దగ్గరకూడా యిలానే కసిరి, కోప్పడి, శాసించగలిగే నోరును విప్పి 'మరికాస్త—...మరికాస్త' అంటూనే పీటలమీంచి కదలలేనంతగా మాచేత తినిపించేసింది. భుక్తాయాసంతో యిద్దరమూ నడవాలో కొచ్చి కూర్చున్నాం. తను కూడా మరో అర్ధగంటలో భోంచేసి వచ్చింది.

"కాస్సేపు సాగిలబడతారేమో, మంచాలు వాల్చుదా మనుకున్నాను. మళ్ళీ ఎందుకులే అనిపించింది. ఎలాగూ సాయంకాలం వెళ్ళిపోతున్నారుగా! ఇంటికెళ్ళాక హాయిగా నిద్రపోదురుగాని. నా గురించి యీ కొద్దిగంటలూ యిబ్బంది పడక తప్పదు," అంది.

"ఇక్కడొద్దు, నా గదిలో కూర్చుందాం రండి. అక్కడ కాస్తంత ప్రశాంతంగా వుంటుంది," అంటూ తన గదిలోకి తీసుకెళ్ళింది. తన స్కూలు విషయాలు చెప్పింది. తమ్ముళ్ళ భవిష్యత్తుగురించి చెప్పింది. సంగీతం గురించి మాట్లాడింది. లలితసంగీతం పాటలు ఓ రెండు వినిపించింది. వైలెన్‌మీద మూడు కృతులు వాయించింది. కామేశ్వర్రావు చిత్రలేఖనాన్ని గూర్చి అడిగింది. నా కథలను గూర్చి చర్చించింది. తరచుగా నా కథల్లో ఆడాళ్ళకు అన్యాయం చేస్తున్నానని గట్టిగా విమర్శించింది. ఏమిటేమిటో చెప్పింది. మంత్రించినట్టు మా మౌనాన్ని తోలేసి ప్రసంగంలోకి దించేసింది. అక్కడ్నుంచి వాదనలోకి లాగేసింది. ఆ వాదప్రతివాదాల్లో పడిన మాకు కాలమే తెలీలేదు.

చూస్తుండగానే మూడున్నర అయిపోయింది. మరో గంటన్నరైతే అక్కడ వుండేది. అయిదున్నరకు బస్సుంది. అయిదింటికి యింటిదగ్గర బయలుదేరితే అర్ధగంటలో బస్సుస్టేండు చేరుకోవచ్చు.

మందాకిని సేపూ అ త సర దాగా, హుషారుగ. ళ్లాడుతూ వున్న దల్లా అకస్మాత డిగులుగా అరి పో యి ది. అర్ధ ంటసేపు షమీ మాట్లాడ కుండానే మౌనంగా వుండిపోయింద

వాళ్ళమ్మగారు టిఫీను, కాఫీ పట్టు కొచ్చారు. మెల్లగా తీసుకుంటున్నాం.

"ఇం కేమిటి విశేషాలు?" అన్నాడు కామేశ్వర్రావు.

"ఏమున్నాయి చెప్పడానికి. అప్పు డప్పుడు వస్తూవుండండి. ఇప్పుడు నాకు కావలసినంత తీరిక. ఉత్తరాలు రాస్తుం టాను. సమాధానాలు యిస్తుంటారు కదూ. ఈ మారుమూల స్నేహితురాల్ని మర్చిపోకండి," అంది మందాకిని.

"మర్చిపోయేంత గొప్ప వాళ్ళం కాలేదు మేము. మర్చిపోయి వుంటే యిప్పుడు యిలా వెతుక్కుంటూ వచ్చే వాళ్ళమే కాదు," అన్నాను నేను.

"మర్చిపోయే గుణం వరికి వుందో తెలుస్తూనే వుంది. ఆ రోజు సింహాచలం కొండమీద మనం కలుసుకోకపోతే మేం నీకు జ్ఞాపకం వుండేవాళ్ళమా?" అన్నాడు కామేశ్వర్రావు.

"ఎందుకలా విపరీతంగా వూహించు కుంటారు?" అంది మందాకిని కాస్త కోపంగా.

"అంతకు ముందు సరేసరి. ఇక్కడకు వచ్చిన తర్వాతన్నా ఓ కార్డు ముక్కన్నా రాయకపోతే ఏమనుకోవాలి," అన్నాను నేను.

కామేశ్వర్రావుకూడా వూరుకోలేదు– "ఎందుకా కోపం. వున్నమాటంటే వులుకెక్కువేలే," అన్నాడు.

ఆమెకు కోపం ఆగిందికాదు.

తాగుతోన్న కాఫీని అక్కడే వొదిలేసి చరచరా పెట్టెదగ్గరకు వెళ్ళింది. పెట్టె తాళం తీసి, లోపలి చీరలన్నిటినీ చివాల్న బయటకు లాగిపడేసి, అట్టడుగునుంచి ఓ కాగితాల దొంతరతీసి ముందుకు గిరాటేసి,




"ఇవన్నీ ఎందుకు దాచుకున్నానంటావ్.. మర్చిపోడానికేనా? చెప్పు కామేశ్వర్రావ్. మాట్లాడవేం?" అంది.

కామేశ్వర్రావు యింకెక్కడ మాట్లాడ గలడు!

నా పరిస్థితీ అలాగేవుంది.

ఆ కాగితాల దొంతరంతా వెనక కామేశ్వర్రావు వేసిన మందాకినీ చిత్రాలే! అతని సంతకాలతో సహా ఎక్కడా చెక్కు చెదరకుండా, పిచ్చిగీతలు కాదుకదా కనీసం నలగనన్నా నలగకుండా అతి భద్రంగా వున్నాయి!!!

నేనే కింద చెల్లాచెదరైన అవన్నీ ఏరి మౌనంగా ఆమె కిచ్చేశాను.

స్కూలునుంచి వాళ్ళ తమ్ముళ్ళు వచ్చేశారు. అప్పుడే నాలుగున్నర అయి పోయింది. గబగబా ముఖాలవి కడుక్కుని, బట్టలు మార్చుకున్నాం. ఇంట్లో అందరికీ చెప్పి బయలుదేరుదా మనుకుంటుండగా 'మీ యిద్దరికీ పూతరేకులు యిష్టమని తెప్పించాను' అంటూ చెరో పొట్లం యిచ్చింది మందాకిని. అందుకుని ఆమెకు కూడా చెప్పి బయలుదేరాం. గేటు తీసుకుని వీధిలో కొచ్చాం. మందాకిని తమ్ముడు రిక్షాగురించి వెళ్ళాడు. ఇంకా రాలేదు. ఎదురుచూస్తూ నుంచున్నాం.

'ఇప్పుడే వస్తాను వుండు' అని చెప్పి లోపలకు వెళ్ళాడు కామేశ్వర్రావు.

అయిదు నిమిషాలు నిలుచుని, ఎంతకీ రాకపోయేసరికి, నేనుకూడా లోపలకు

వెళ్ళాను. మందాకిని గదిలోంచి గట్టిగా మాటలు వినిపిస్తున్నాయి – గదిలో కాలు పెట్టేసరికి—

కామేశ్వర్రావు ముఖమంతా జేవురించిపోయివుంది. అతను అంటున్నాడు... "మరీ అంత తెలివితక్కువదానిలా ప్రవర్తించకు. దేనికైనా అర్థంపర్థం అంటూ వుండాలి. మొండితనానికికూడా ఒక హద్దంటూ వుంది. నా బొమ్మలు నా కిచ్చెయ్యమంటే ఏమిటా పట్టుదల. ఇంత జరిగిన తర్వాతకూడా యింకా బుద్ధిలేకపోతే ఏమనుకోవాలి. చేజేతులా నీ నాశనాన్ని నువ్వే కోరి తెచ్చుకునేంత పిచ్చిదానివైపోయావేం. ఇంత మొండితనం పనికిరాదు."

"నేను ఇవ్వనుగాక ఇవ్వను," అంది మందాకిని. టేబిలుమీద వుండిపోయిన బొమ్మల్ని తీసుకుని పెట్టెలో దాచేసుకుంది.

రిక్షా వచ్చినట్టుంది, మువ్వలశబ్దం వినిపించింది. కామేశ్వర్రావుని వెంటబెట్టుకుని వచ్చేశాను.

"చూడు, మందాకిని ఎంత తెలివితక్కువగా ప్రవర్తిస్తోందో," అన్నాడు కామేశ్వర్రావు బస్సులో. అంతకన్నా అతనింకేమీ వ్యాఖ్యానం చెయ్యలేదు.

మందాకినిని చూడాలి ... చూడాలి అనుకున్నప్పటి ఆనందం యిప్పుడు లేదు. ఆమె చిరునవ్వుల్ని ఎక్కడ చూడగలిగాం? తనను తాను దాచుకోవడానికి ఆమె పడిన పాట్లూ, వెనకటి స్వేచ్ఛా లేదన్న ఆలోచనలతో ముఖంలో అల్లుకున్న విచారం, తన విషాదచరిత్ర మాకు తెలిసిపోయిందన్న బాధ–యివే మాకు కనిపించాయి. ఆమెతో పాటు ఆ బాధ మాకూ తప్పలేదు. మందాకినిని ఏడిపించడానికే మేం వెళ్ళామనిపించింది.

ఆమెను ఏడిపించే అధికారం మాకు లేదు. అవును, మాకు లేదు.

మళ్ళీ మా మా ఉద్యోగాలు మాకు మిగిలిపోయాయి.

మందాకినీనుంచి తరచుగా ఉత్తరాలు వస్తున్నాయి. ఆమె ఉత్తరాలు ఆలోచనల్ని రేకెత్తింపేవిగా వుంటాయి. అవంటే నాకు చాలా యిష్టం. నానుండి సుదీర్ఘమైన ఉత్తరాల్ని కోరుతుండేది. అలాగే రాస్తుండేవాడిని. ఎప్పుడైనా సమాధానం రాయడానికి నాలుగురోజులు ఆలస్యమైతే ఎక్స్‌ప్రెస్ ఉత్తరం రాసేది. 'ఈ మారుమూల ఒంటరి జీవితంలో యీ ఉత్తరాలే నాకు ఆప్తులు. వాటిని పంపించడం మానొద్దు,' అనేది. కామేశ్వర్రావు దగ్గర్నుంచికూడా ఆమె, ఉత్తరాలు అందుకుంటుండేది.

చాలాసార్లు ఆమె మళ్ళీ ఒకసారి మా యిద్దర్నీ కలిసిరమ్మని రాసిందికాని వెళ్ళలేదు. మేం వెళ్ళడం ఆమెకు ఏవిధంగానూ ఆనందదాయకం కాదు. ఈ ఉత్తరాలు చాలు జ్ఞాపకాలని నిలపడానికి.

ఒకసారి కామేశ్వర్రావు ఉత్తరం రాశాడు –

"......చాలా చిత్రమైన సంఘటనోయ్! మా ఆఫీసులో జగ్గూ అని ఒక మిత్రుడున్నాడు. వాడొచ్చి 'మధ్యాహ్నం నీ గురించి గౌరీపతి వచ్చాడేం? నీ కెట్లా తెలుసాయన?' అన్నాడు. గౌరీపతి ఎవరా అని ఆశ్చర్యపోయాను. నా గురించి మధ్యాహ్నం ఎవరూ రాలేదుకూడాను. అదే చెప్పాను. అతను ఆశ్చర్యపోయి, 'అదేమిటి! మధ్యాహ్నం నీ గురించి వస్తేను. నీ సీటెక్కడా అని ప్యూన్‌ని అడుగుతుంటే అటొస్తూ ఆలకించి ఆగిపోయాను. అక్కడికీ బొమ్మలేస్తుంటాడు ఆ కామేశ్వర్రావేనా అన్నాను. అవునన్నాడు. సెక్షన్ ఎక్కడో చెప్తుండగా నువ్వే కనిపించావు. కేంటీన్‌కు గాబోలు వెళ్తున్నావు. పిలిచానుగాని వినపడలేదు గాబోలు. నే కలుస్తానని ఆయనని వై... చ్చాడు. ... కలవనేలేదా?' అని అడిగాడు జగ్గూ. లేదన్నాను. ఆ గౌరీపతి ఎవరో నా కర్థం కాలేదు. ఆ పేరుగల స్నేహితులెవరూ నాకు లేరు. 'అతను ఏం చేస్తుంటాడోయ్, నీకు తెలుసా?' అని జగ్గూను అడిగాను. అతనితో పరిచయం లేకపోయినా అతన్ని గురించి జగ్గూకు తెలుసట. జగ్గూకు కాలేజీలో అతను రెండేళ్లు సీనియర్ అట. 'స్పోర్ట్స్ ఛాంపియన్'–అందువల్ల అందరికీ అతను బాగా తెలుసు' అన్నాడు. ఖర్గపూర్‌లో రైల్వేలో పనిచేస్తున్నాడట. ఇప్పుడు అర్థమయ్యిందిగా అతనెవరో. మన మందాకినీ మొగుడే. అనుమానం వచ్చి ఇంటికెళ్ళాక మందాకిని పెళ్ళి తాలూకు వెడ్డింగ్ కార్డు బయటికి తీసి చూశాను. అదే పేరు. ఇది జరిగి పద్రాడు రోజు లయ్యింది. ఇంతవరకూ అతను కలవనేలేదు......"

అతను ఇక కలవడు. నాకు తెలుసు అతను చాలా సంతోషంగా, తృప్తిగా, తేలిగ్గా యీపాటికి యింటికి వెళ్లిపోయి ఉంటాడు.

మరి కొద్దిరోజుల్లో మందాకిని దగ్గర్నుంచి కామేశ్వర్రావుకూ, నాకూ ఉత్తరాలు కూడా రావొచ్చు. వాళ్ళాయన వచ్చాడనీ, తనను తీసుకెళ్ళబోతున్నాడనీ రాస్తుంది.

ఆ సంఘటన జరిగేవరకూ యీ కథను పొడిగించాలనుకోవడం లేదు నేను. అది తప్పకుండా జరుగుతుంది. ఈ నా విశ్వాసాన్ని వెలిగించే ఆశ—అది కామేశ్వర్రావు ఆకారం.

పురిట్లోనే పెద్ద జబ్బు చేసి, కుడికాలు పడిపోయి అతను అవిటివాడైపోయాడు.

ఈ కాస్త చమురూ చాలు యీ దీపం వెలగడానికి.

✲